



బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

- అద్భుతంగా ఉందన్న కాంగ్రెస్
- ప్రజావ్యతిరేక బడ్జెట్ అంటున్న ప్రతిపక్షాలు
- వ్యవసాయానికి అత్యధిక కేటాయింపులతో రైతుల్లో సంతోషం
- పంటల బీమా, వరి బోనస్, రైతు కూలీలకు రూ.12వేలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రాష్ట్ర వార్షిక బడ్జెట్‌పై జిల్లాలో మిశ్రమ స్పందన వ్యక్తమవుతున్నది. అధికార కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం, వ్యవసాయరంగంతోపాటు అన్ని వర్గాల అభివృద్ధికి బాటలు వేసేదిగా ఈ బడ్జెట్‌ను అభివర్ణించింది. బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాలు ముందు చూపులేని ప్రజావ్యతిరేక బడ్జెట్‌గా పేర్కొన్నాయి. 2,91,159 కోట్లతో కూడిన రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను గురువారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి డి శ్రీధర్‌బాబు శాసనమండలిలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌లో 72,659 కోట్ల రూపాయలు వ్యవసాయ రంగానికి కేటాయించి పెద్దపీట వేయడంపై హర్షం వ్యక్తమవుతున్నది. రైతు రుణమాఫీకి మరో 31వేల కోట్లను కేటాయించడంతో త్వరలోనే రెండు లక్షల రూపాయల వరకు తీసుకున్న రుణాలన్నీ మాఫీ అవుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 32 రకాల సన్నవరి రకాలను సాగు చేసే రైతులకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్‌ను ఇచ్చేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. జిల్లాలో సన్నవరి రకాల సాగు పెరుగనున్నదని అంచనా వేస్తున్నారు. రైతు కూలీలకు యేటా 12వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. ఈ పథకంతో జిల్లాలో వేల సంఖ్యలో ఉన్న రైతుకూలీలకు ఆర్థిక సహాయం అందనున్నది. రైతులకు పంటల బీమా అమలు చేయడానికి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వివిధ పంటలకు బీమా లభించనున్నది. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున జిల్లాకు 15,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి. ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలు చేసి స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు 10 లక్షల రూపాయల బీమాను అందించడానికి ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. దీంతో జిల్లాలోని 13,712 స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,48,973 మంది మహిళలకు ప్రయోజనం చేకూరనున్నది. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించే పథకానికి బడ్జెట్‌లో 723 కోట్లు కేటాయించారు. జిల్లాలో 3,12,206 గ్యాస్ కనెక్షన్లు ఉండగా వీరిలో 60 శాతం మందికి ఈ ప్రయోజనం చేకూరనున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉచిత విద్యుత్ పథకం కింద 200 యూనిట్ల వరకు జీరో బిల్లు అమలు చేసేందుకు 2,418 కోట్లు కేటాయించడాన్ని అల్పాదా యవర్గాలు అభినందిస్తున్నాయి. మహిళలకు 2,500 రూపాయలు ఇస్తా మన్న కాంగ్రెస్ హామీని ఆ పార్టీ ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రస్తావించలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఆసరా పింఛన్లను నాలుగు వేల రూపాయలకు, దివ్యాంగుల పింఛన్లనునుంచి 6వేలకు పెంచే ప్రతిపాదన ప్రస్తావనే లేకపోవడంపై విపక్షాలు తప్పుబడుతున్నాయి. అధికారంలోకి రాగానే ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించక పోవడాన్ని, ఆరు గ్యారెంటీల పథకాన్ని అమలు చేయక పోవడాన్ని కూడా బీఆర్ఎస్, బీజేపీ విమర్శిస్తున్నాయి.

విద్యారంగానికి నామమాత్రంగా కేటాయింపులు

- ఎం రఘుశంకర్‌రెడ్డి, డీటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి నామమాత్రంగా కేటాయింపులు చేసింది. విద్యారంగానికి 7.31శాతం నిధులు కేటాయించారు. పాలకులు విద్యారంగాన్ని ప్రాధాన్యంగా గుర్తించడం లేదు. పాఠశాలలు, మౌలిక వసతులు, స్కావెంజర్లు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిగణలోకి తీసుకోలేదు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న డీఏలు, పీఆర్సీని ప్రస్తావించక పోవడం శోచనీయం.

అన్ని వర్గాలకు తగిన ప్రాధాన్యం


- కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, సుడా చైర్మన్



రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు ప్రాధాన్యం లభించింది. స్త్రీ శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు బీసీల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. వ్యవసాయరంగంతోపాటు గ్రామీణాభివృద్ధికి ఎక్కువ నిధులు కేటాయించారు. గృహజ్యోతి, గ్యాస్ సబ్సిడీకి నిధులు కేటాయించారు. అన్ని వర్గాలను ఆదుకోవడమే లక్ష్యంగా బడ్జెట్ ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలనకు ఈ బడ్జెట్ నిదర్శనం.

ప్రగతి నిరోధక బడ్జెట్

- పి సుగుణాకర్‌రావు, బీజేపీ నాయకుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాబడి, ఖర్చుల లెక్క పత్రంలా ఉంది. కేటాయింపులు చెప్పడం మినహా లక్ష్యంలేని బడ్జెట్. భవిష్యత్‌లో ఎలాంటి అభివృద్ధి చేయబోతున్నారు అనే దానిపై దృష్టిపెట్టని విజన్ లేని బడ్జెట్. ఎన్నికల హామీలను కూడా తీర్చలేని బడ్జెట్. ఎలాంటి విజన్ లేని ప్రగతి నిరోధక బడ్జెట్ ఇది.

అప్పుల, అబద్ధాల, ప్రజావ్యతిరేక బడ్జెట్


- కొట్టె మురళీకృష్ణ, బీజేపీ నాయకుడు



బడాయి, అప్పుల, అబద్ధాల, ప్రజా వ్యతిరేక బడ్జెట్ ఇది. 62 వేల కోట్ల అప్పులు ఎలా తెస్తారో సమాధానం చెప్పాలి. రాష్ట్రాన్ని దివాళా తీసే దిశగా తీసుకెళ్తున్నారు. హామీల మేరకు బడ్జెట్ ఇవ్వకుండా మోసం చేశారు.అరకొర నిధులతో ప్రాజెక్టులు ఎలా ముందుకు తీసుకెళ్తారు.

బీసీలను నిరాశపరిచిన బడ్జెట్

-నర్సింగోజు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు, బీసీ యువజన సంఘం



జనాభాలో 56శాతం ఉన్న బీసీలకు 2,92,150 కోట్ల బడ్జెట్‌లో కేవలం 9,200 కోట్లు కేటాయించి బీసీలను నిరాశకు గురి చేశారు. అరకొర నిధులతో బీసీలకు మొండి చేయి చూపించారు. ప్రతిసారి చిన్నచూపు బీసీలను అణచివేసే ధోరణిలో ప్రభుత్వాలతీరు ఉంటుంది.

ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన బడ్జెట్


- దామెర సత్యం, టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి



రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశల మీద నీళ్లు చల్లింది. ఈ బడ్జెట్ ఏ వర్గానికి న్యాయం జరిగేలా లేదు. ఐటీ రంగానికి, పారిశ్రామిక రంగాల మీద పాలసీలు లేవు. రైతు భరోసా మీద అనేక ఆంక్షలు పెట్టింది. రైతులను, కులవృత్తిదారులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

క్రీడారంగానికి పెద్దపీట


- గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో క్రీడారంగానికి పెద్దపీట వేసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా 325 కోట్లు కేటాయించడం క్రీడారంగ పురోగాభివృద్ధికి తోడ్పడుతుంది. దేశంలో తెలంగాణ రాష్ట్రం క్రీడారంగంలో ముందంజలో నిలిచే అవకాశాలున్నాయి.

కేంద్రం వంచించినా.. రాష్ట్ర ప్రభుత్వం కరుణించింది

- డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరుగగా, రాష్ట్ర బడ్జెట్ వల్ల తెలంగాణ ప్రజలకు న్యాయం చేకూరింది. కేంద్ర బడ్జెట్ నిరాశపర్చగా, రాష్ట్ర బడ్జెట్ సంతోషం కలిగించింది. అన్నివర్గాల ప్రజల ప్రజలను సంతృప్తి కలిగించేలా ఉంది. వ్యవసాయం, విద్య, మహిళా, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేయడం రేవంత్‌రెడ్డి సర్కార్ చిత్తశుద్ధికి నిదర్శనం. పేద ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఉంది. హార్టికల్చర్ కోసం ఈ బడ్జెట్‌లో 737 కోట్లు కేటాయించారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవడమే కాకుండా నాణ్యమైన విత్తనాలను అందించేందుకు అవసరమైన చర్యలకు పూనుకోవడం ద్వారా తమ ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చనున్నది. గూడులేని నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేలా ఈ బడ్జెట్ రూపకల్పన చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్ల చొప్పున మొత్తం రాష్ట్రంలో 4 లక్షల 50 వేల గృహాల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడం నిరుపేదలకు వరం.

దేశానికే దిక్సూచిగా తెలంగాణ బడ్జెట్

- వెలిచాల రాజేందర్‌రావు, కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి



2,91,159 కోట్లతో డిప్యూటీ సీఎం, రెవెన్యూమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ దేశానికే దిక్సూచి. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జనరంజక బడ్జెట్ రూపొందించారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి బడ్జెట్‌లో సింహభాగం నిధులు కేటాయించడం అభినందనీయం. అప్పులకుప్పగా మార్చిన బీఆర్ఎస్ సర్కార్ వైఖరి వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం 42,892 కోట్ల అప్పులకు వడ్డీ చెల్లించింది. గ్రామీణాభివృద్ధిశాఖకు 29,816 కోట్లు, హైదరాబాద్ సిటి అభివృద్ధికి పది వేల కోట్లు, బీసీ సంక్షేమానికి 9,200 కోట్లు, మైనార్టీ సంక్షేమానికి 3003 కోట్లు, గ్యాస్ సబ్సిడీ స్కీంకు 723 కోట్లు కేటాయించడం అభినందనీయం.

విద్యారంగానికి అరకొర నిధులు

- వి రాజిరెడ్డి, డీటీఎఫ్ రాష్ట్రఉపాధ్యక్షుడు

బడ్జెట్‌లోఓ విద్యారంగానికి ప్రభుత్వం అరకొర నిధులు కేటాయించడం విచారకరం. బడ్జెట్‌లో విద్యకు 7.31శాతం నిధులు కేటాయించడం తీవ్రనిరాశను కలిగించింది. విద్యకు 20శాతం నిధులు కేటాయించాలని కోరినప్పటికి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పీఆర్సీ, డీఏలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు.

బడ్జెట్‌ను హర్షిస్తున్నాం

- మర్రి వెంకటస్వామి, సీపీఐ జిల్లాకార్యదర్శి



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ, రైతు రంగానికి పెద్ద పీట వేసి పేదలకు 12 వేలు ఇవ్వడాన్ని హర్షిస్తున్నాం. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరిచే బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది.

ప్రాధాన్య రంగాలకు అన్యాయం

- మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి



రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్య రంగాలకు అన్యాయం జరిగింది. విద్య, వైద్యం, ఉత్పాదక రంగాలకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించారు. 2.91 లక్షల కోట్ల బడ్జెట్ ప్రతిపాదించినప్పటికీ జిల్లాకు మొండి చేయి చూపారు. జిల్లాలోని పెండింగ్‌పనులకు నిధులు కేటాయించలేదు.

విద్యారంగాన్ని విస్మరించిన బడ్జెట్

- కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించింది. 2.91 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి 7.3 శాతం నిధులు కేటాయించారు. ఎన్నికల ముందు విద్యకు బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని హామి ఇచ్చారు.శాతావాహనయూనవర్సిటీకి 200 కోట్లు ఇస్తారనుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలకు కలిపి 500 కోట్లు ఇవ్వడం సరికాదు. - భగత్‌నగర్

వనమహోత్సవాన్ని ఉద్యమంలా చేపట్టాలి

- వారంరోజుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వనమహోత్సవాన్ని ఉద్యమంలా చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం జడ్పీ క్వార్టర్స్ సమావేశ మందిరంలో వనమహోత్సవంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులకు నిర్దేశించిన లక్ష్యాన్ని వారంరోజుల్లో పూర్తి చేయా లని ఆదేశించారు. ప్రతిరోజు ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించాలన్నారు. వారంరోజుల్లోగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు.

● పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

గ్రామాలు, పట్టణాలు అందంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య కార్మికుల సేవలు అద్భుతమని, వారి సేవలను వెలకట్టలేమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం పారిశుధ్య కార్మికుల క్షేమం.. గౌరవం అనే కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగించారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు.

● వసతి గహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

కరీంనగర్ రూరల్: వసతి గృహల్లో ఉండే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఎస్సీ వసతి గృహాన్నీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. రీడింగ్ రూమ్, వంటగది, పడుకునే గదులను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులున్నారో అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన బోజనం పెట్టాలని ఏ సమస్య ఉ న్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.


రైతులకు భరోసా కల్పించండి

- నీటిని పంపింగ్ చేసి రిజర్వాయర్లను నింపండి
- ఎల్ఎండీ సందర్శనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తిమ్మాపూర్, జూలై 25: 'మేడిగడ్డ బ్యారేజీ నుంచి ప్రతి రోజు లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వృథాగా పోతున్నాయి.. రాష్ట్ర ప్రభుత్వం ఆ నీటిని పంపింగ్ చేసి రిజర్వాయర్లను నింపి రైతులకు భరోసా కల్పించాలి' బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ కె తారక రామారావు అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో కలిసి ఆయన కరీంనగర్ సమీపంలోని దిగువ మానేరు జలాశయాన్ని (ఎల్ఎండీ)ని గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్ఎండీలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు, గతంలో ఈ సమయానికి ఉన్న నీటి నిల్వలు, ప్రస్తుతం వస్తున్న ఇన్‌ఫ్లో గురించి ఇరిగేషన్ శాఖ ఈఈ శ్రీనివాస్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మేడిగడ్డలో జరిగిన చిన్న సంఘటన ను పట్టుకుని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరాన్ని ఒక విఫల ప్రాజెక్టుగా చూపాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో తాము సాగునీటి రంగంలో విప్లవం తీసుకువచ్చామన్నారు. దీంతో నీటి లభ్యత పెరిగి వ్యవసాయ విస్తారణ బాగా జరిగిందన్నారు. గత సంవత్సరం ఇదే రోజు లోయర్ మానేరు డ్యాంలో 12 టీఎంసీల నీరు ఉందని, ఐదు రోజుల అనంతరం నీటి పంపింగ్ చేయడంతో రిజర్వాయర్ పూర్తి సామర్థ్యానికి చేరుకుందన్నారు. ఈ సంవత్సరం ఇప్పటికి 45 శాతం తక్కువ వర్ష పాతం నమోదైందని అధికారులు చెప్పారని, సెప్టెంబరు మాసం వరకు వర్షం పాడే అవకాశం ఉన్నా దానికి గ్యారంటీ లేదు. ఈ పరిస్థితుల్లో పంపింగ్ చేస్తే కాని రిజర్వాయర్లు నిండి వ్యవసాయం ముందుకు సాగదన్నారు. రైతులు సాగునీరు లేక ఆందోళన చెందుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రాజకీయ పరమైనా కక్ష పెట్టుకొని పంపింగ్ ప్రారంభించకుండా ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. కన్నెపల్లి వద్ద పంపులు ఆన్‌చేస్తే అన్ని రిజర్వాయర్లు నిండుతాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమాలకర్ సూచన మేరకు ఎల్ఎండీకి తమ బృందం వచ్చిందని కేటీఆర్ తెలిపారు. 10 లక్షల క్యూసెక్కుల నీళ్లను తట్టుకుని మేడిగడ్డ నిలబడిందన్నారు. ఎన్నికలు ముగిశాయని, ఇకనైనా రాజకీయలు వదిలి పెట్టాలి రైతులకు మేలు చేయాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. శుక్రవారం మధ్యాహ్నంలోపు కన్నెపల్లి పంప్ హౌస్, మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి శాసనసభ సమావేశాలకు హాజరవుతామని కేటీఆర్ తెలిపారు. కాళేశ్వరం కింద ఉన్న రిజర్వాయర్లన్నింటిని నింపుకుంటే 240టీఎంసీల పైచిలుకు నీటిని నిల్వ చేసుకోవచ్చని, 24 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చని కేటీఆర్ తెలిపారు. అనంతరం దిగువ మానేరు జలాశయం గేట్ల సమీపంలో ఉన్న ఫ్లడ్ కంట్రోల్ రూంలో కొద్ది సేపు కేటీఆర్ బృదం కూర్చుని కరీంనగర్‌కు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, సునీత లక్ష్మా రెడ్డి, సబిత ఇంద్రరెడ్డి, కోవ లక్ష్మి, జగదీశ్వర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, సత్యవతి రాథోడ్, శంభీర్‌పూర్ రాజు, మేయర్ సునీల్‌రావు, సర్దార్ రవీందర్ సింగ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్సీలు నారాదాసు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.



లోయర్ మానేరు డ్యాంలో నీటి నిలువలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కేటీ రామారావు, ఎమ్మెల్యేలు



ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేష్‌నగర్, జూలై 25: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం పరీక్షల నియంత్ర అధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.







వివాహిత ఆత్మహత్య

చొప్పదండి, జూలై 25: చొప్పదండిలోని సంతోష్‌నగర్‌లో ఓవివాహిత ఇంట్లో ఉరి వేసుకొని గురువారం ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ అనూష కథనం మేరకు.. రాచకొండ మమత వివాహం 2019లో లక్ష్మణ్‌తో జరిగింది. పిల్లలు పుట్టడం లేదని దంపతుల మధ్య సంవత్సరం నుంచి గొడవలు జరుగుతున్నాయి. మమతను లక్ష్మణ్ వేధిస్తున్నాడని ఈనెల 8న తల్లిదండ్రులు మమతను పుట్టింటికి తీసుకుపోయారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని మమత ఆత్మహత్య చేసుకున్నట్టు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జగిత్యాలలో మూడిళ్లలో చోరీ

జగిత్యాల టౌన్, జూలై 25: జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో గురువారం తెల్లవారుజామున మూడు ఇళ్లలో చోరీ జరిగింది. గోవిందుపల్లి ప్రాంతానికి చెందిన ఎదురుగట్ల సతీష్‌తోపాటు మరో ఇద్దరి ఇళ్లల్లోకి దొంగలు చొరబడి ఇంటి, బీరువా తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడ్డారు. 15 తులాల బంగారంతోపాటు నాలు గు లక్షల రూపాయలు దోచుకెళ్లారు. నిందితులు తమ ఆనవాల్లు దొరకకుండా సీసీ కెమెరాలు, రూటర్లను ధ్వసం చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించి కేసు నమోదు చేశారు.







కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, జూలై 25: కేంద్రం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. కరీంనగర్ లోని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘ భవనంలో సీపీఐ ఉమ్మడి జిల్లా రాజకీయ శిక్షణ శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు చెక్ పెట్టడంతో ఏన్డీఏ మిత్రపక్షాలు మోదీకి చెక్ పెట్టాయన్నారు. ఎన్డీఏ పక్షాలైన ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేశారన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. 44 కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాశారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను గమనించిన ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించిం దన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఈ దేశంలో అంతర్భాగమే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేశారన్నార ని విమర్శించారు. భూ సమస్యలు పరిష్కరించలేదని, ప్రజలు కేసీఆర్ వైఖరిపై విసిగివేసారి గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించినప్పుడే ప్రజా విశ్వాసం పొందుతారన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు తక్షణమే అందించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ ఇవ్వాలన్నారు. ధరణి పోర్టల్‌లో ఉన్న లొసుగులను సవరించి రైతుల భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. భారత కమ్యునిస్టు పార్టీ సీపీఐ అవిర్భవించి డిసెంబరు 25 నాటికి 100 సంవత్సరాలు పూర్తి అవుతుందన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్రలో నిరంతరం, కార్మికులు, కర్షకులు, ప్రజల సమస్యల పరిష్కారమే ఏజెండగా ముందుకు సాగుతోందన్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రజా సంఘాలను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసుకోవడానికి రాజకీయ శిక్షణ శిబిరాలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, గుంటి వేణు, తాంద్ర సదానందం, వెన్న సురేష్, పొనగంటి కేదారి, గడిపె మల్లేష్, గోషిక మోహన్, కసిరెడ్డి మణికంఠరెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి దోస్త్ ప్రత్యేక కౌన్సెలింగ్

గణేష్‌నగర్, జూలై 25: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దోస్త్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌనెల్సింగ్ నిర్వహిస్తున్నామని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రకటించారని దోస్త్ కో ఆర్డినేటర్ సూరేపల్లి సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందని విద్యార్థులు ప్రత్యేక కౌన్సెలింగ్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 2 వరకు రిజిస్ట్రేషన్, 27 నుంచి ఆగస్టు 3 వరకు వెబ్ ఆప్షన్స్, ఆగస్టు 6న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఆగస్టు 9లోగా రిపోర్టు చేయా లన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు దోస్త్ షెడ్యూ ల్ ప్రకారం ఈనెల 15 నుంచి ప్రారంభించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

జ్యోతినగర్, జూలై 25: ఎన్టీపీసీ సుభాష్‌నగర్ సమీప రాజీవ్ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. రామగుండం వైపు నుంచి వస్తున్న ఆటో రోడ్డుపై ఉన్న గేదెను ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న బాదావత్ శేఖర్(35) తీవ్రంగా గాయపడ్డాడు. శేఖర్‌ను గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుం డగా మార్గమధ్యలో చనిపోయాడు. రామగుండం ఎన్టీ కాలనీలో శేఖర్ నివాసం ఉంటున్నాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ప్రశాంత్‌కు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● కరీంనగర్‌లో వ్యాపారి..

కరీంనగర్ క్రైం: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కరీంనగర్‌కు చెందిన వ్యాపారి తాటికొండ రమేష్ (49) మృతి చెందాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. రమేష్ చొప్పదండిలో బుక్‌స్టాల్ నడుపుతూ కరీంనగర్ నుంచి రోజు చొప్పదండికి వెళ్లి రాత్రి తిరిగి కరీంనగర్‌కు వస్తుంటాడు. ఇదే క్రమంలో బుధవారం రాత్రి బుక్‌స్టాల్ మూసివేసి తన కారులో బయలుదేరిన రమేష్ నగునూర్‌లోని ఎస్సీఆర్ స్కూల్ వద్దకు రాగానే రోడ్డుపై పార్క్ చేసిన లారీని వెనక నుంచి కారు ఢీకొట్టింది. దీంతో రమేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రమేష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు అసెంబ్లీలో తీర్మానం చేయాలి'

కరీంనగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయాలని మాజీ ఎంపీ బోయినప ల్లి వినోద్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని ఒక ప్రకటనలో కోరారు. నీట్ ఎంట్రెన్స్ పరీక్ష మాత్రమేనన్నారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక రాష్ట్రాలు నీట్ నుంచి వైదొలుగుతున్నట్లు వారి శాసనసభల్లో తీర్మాణాలు చేశాయని తెలిపారు. నీట్‌తో లాభం కంటే నష్టం ఎక్కువగా ఉందన్నారు. తెలంగాణలో పీజీ సీట్లు ఎక్కువ ఉన్నాయని, నీట్ ద్వారా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా లక్ష ఎంబీబీఎస్ సీట్లు ఉంటే అందులో దాదాపు 10 శాతం 8,265 మంది విద్యార్థులు తెలంగాణలోనే ఉన్నారని చెప్పారు. నీట్‌పై అపనమ్మకం ఏర్పడిందని అన్నారు.



చింతన

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా, 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తి ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.

ముక్తి సాధన కోసం... గకార చతుష్టయం



చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.

ఋగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధి



స్తారు. గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.



అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం... 'గకార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వినిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యథాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితే ముక్తి. అంటే.. వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనసు మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013

భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచివాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు... సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

"ఎందుకు చంపలేను? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.

'చూశావా!' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.


"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.

"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.



ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా సమసిపోయాయి.


శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే... దానిలోంచి దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా... పరమాత్మ తత్త్వాన్ని గ్రహించలేరు. మోక్షపథాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MNuqlklలో చదవండి.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగన్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభన్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్ణ వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహార్యశ్రేణికిం దెల్పెనో... అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తిమీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.

6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేరుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్ధంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్లు జోషి వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

సైయెంట్ లాభంలో 17శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

» ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
» అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్వాటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్షియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకీ ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆర్యోగానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ ఛైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ చేతికి దక్షిణ్ ఫౌండ్రీ

డీల్ విలువ రూ.153 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎఫ్‌పీఎల్)లో 100 శాతం వాటాలను రూ.153.12 కోట్లకు కొనుగోలు చేసినట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. డీఎఫ్‌పీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పదిహేను రోజుల్లో ఈ డీల్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి డీఎఫ్‌పీఎల్ వద్ద రూ.42.71 కోట్ల నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. డక్టైల్ ఐరన్, గ్రే ఐరన్, లో కార్బన్ అల్లాయ్ స్టీల్ గ్రేడ్స్, సిమో ఐరన్ కాస్టింగ్స్ తయారీలో డీఎఫ్‌పీఎల్ కీలకంగా ఉంది. బెంగళూరు, హోస్కోట్‌లో ఏటా 4,200 టన్నుల స్థాపిత సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది. డీఎఫ్‌పీఎల్ కొనుగోలుతో పిట్టీ ఇంజనీరింగ్ ఉత్పత్తి సామర్థ్యపరంగా మరింత బలోపేతం కానుందని సంస్థ ఎండీ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

స్థిరాస్తుల అమ్మకాల లాభాలపై కొత్త కొర్రీ

» వడ్డీ, స్టాంప్ డ్యూటీలు ఖర్చులు యథాతథం

న్యూఢిల్లీ: స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) తగ్గించామని చెబుతూనే.. ప్రభుత్వం పెద్ద బాంబు పేల్చింది. ఈ లాభాల లెక్కింపు కోసం ఆస్తుల కనీస విలువను లెక్కించేటప్పుడు, వాటిని కొనేటప్పుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, అప్పు చేసి కొంటే.. ఆ అప్పులపై చెల్లించే వడ్డీల భారం.. ప్రస్తుతం ఉన్న విధంగానే లెక్కింపులోకి రాదని స్పష్టం చేసింది. కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం ఈ విషయం వెల్లడించారు. కొత్త ఎల్‌టీసీజీటీ విధానంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. దీంతో ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించే ఇండెక్సేషన్ ఖర్చుల ప్రయోజనం రద్దయి, స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గినా అమ్మకందారులకు పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తున్నారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ,28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్లు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు. ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్లు మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.

రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్లు రాజు వెల్లడించారు.

సత్సాంప్రదాయాన్ని పాటించండి

-చిన్న జీయర్‌స్వామి



మాట్లాడుతున్న చిన్న జీయర్‌స్వామి

కరీంనగర్ కల్చరల్, జూలై 25: ప్రతీ వ్యక్తి సత్సాంప్రదాయం పాటించాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో ఇటీవల పరమపదించిన శ్రీకృష్ణ యతీంద్ర రామానుజ జీయర్‌స్వామి పరమపదోత్సవానికి స్వామీజీ హాజరయ్యారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామీజీ మాట్లాడుతూ సాంప్రదాయ, ఆచార్య పరంపరలను కొనసాగించాలని అన్నారు. అంతకు ముందు అహోబిల రామానుజ జీయర్‌స్వామి మాట్లాడుతూ పరమపదం చేరిన స్వామీజికి తమకు గతంలో సన్నిహిత సంబంధం ఉందని అన్నారు. వారితో గల అనుబంధాన్ని గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వామీజీ పూర్వాశ్రమ కుమారులు డాక్టర్ శ్రీమన్నారాయణాచార్యులు, జగన్నాథాచార్యులు, సింహాద్రి, డాక్టర్ కలువకుంట రామకృష్ణ, పండితులు నేపాల్ కృష్ణమాచార్యులు, నంబి వేణుగోపాలా చార్యులు, గోవర్ధనగిరి జగన్నాథాచార్యులు, గోవర్ధనగిరి అనంతాచార్యులు, నమిల కొండ రమణాచార్యులు, కలకుంట్ల వేదాంతాచార్యులు, కెఎస్ అనంతాచార్యులు, డాక్టర్ కె వరప్రసాదాచార్యులతో పాటు పండితులు, భక్తులు, వికాసతరంగిణి బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● శ్రీవైష్ణవ సంఘ భవన నిర్మాణ స్థలం సందర్శన

సప్తగిరి కాలనిలోని శ్రీవైష్ణవసేవాసంఘం భవన నిర్మాణ స్థలాన్ని చిన్న జీయర్‌స్వామి, అహోబిల జీయర్‌స్వామి సందర్శించారు. నిర్మాణ పనులు, ఆలయ వివరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. శ్రీవైష్ణవ కులజులు అందరి ఆర్థిక సహకారంతో స్థలం, సంఘ భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధ్యక్ష కార్యదర్శులు పీచర కృష్ణమాచార్యులు, గోవర్ధనగిరి శశికిరణ్ ఆచార్య వివరించారు. కార్యక్రమంలో సంఘ బాధ్యులు, సభ్యులతో పాటు వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు కె గౌతమరావు పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత ఐవీఎఫ్ క్యాంపు

సుభాష్‌నగర్, జూలై 25: వరల్డ్ ఐవీఎఫ్, ఎంబ్రియాలజీ డే ను పురస్కరించుకొని సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ రజనీప్రియదర్శిని ఆధ్వర్యంలో స్థానిక రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో నిర్వహించిన ఉచిత ఐవీఎఫ్ క్యాంపు గురువారం విజయవంతంగా ముగిసింది. రెనే ఆసుపత్రి అధినేత డాక్టర్ బంగారి స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి క్యాంపును ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ సంతానలేమి సమస్యలో స్త్రీ, పురుషుల సమాన బాధ్యత ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ రజనీ ఫెర్టిలిటీ సెంటర్‌లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ల్యాబ్ ఉందన్నారు. చికిత్స కోసం రెండు తెలుగురాష్ట్రాల నుంచి వస్తున్న వారికి వసతి కూడా ఉచితంగా సమకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ తాటిమట్ల దినకర్, డాక్టర్ నిఖిల్‌లక్ష్మన్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ దామోదర్‌రెడ్డి, డాక్టర్ మౌనిక, డాక్టర్ అవనిజ, ఆసుపత్రి జనరల్ మేనేజర్ డాక్టర్ అరవింద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న గార్డియన్ స్కూల్ విద్యార్థులు

జమ్మికుంట రూరల్, జూలై 25: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల గార్డియన్ ఇంగ్లీష్ మీడియంస్కూల్‌లో గురువారం బోనాల వేడుకలు నిర్వహించారు. మహంకాళి అమ్మవారి చిత్రపటానికి పూలు, పండ్లు సమర్పించి, మట్టి పాత్రలతో బోనం తయారు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పిల్లలచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంకూస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్ద పీట'

గణేష్‌నగర్, జూలై 25: రాష్ట్ర బడ్జెటలో అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పీట వేశారని శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర ఆచార్యులు డాక్టర్ కోడూరి శ్రీవాణి అన్నారు. రెవెన్యూ వ్యయం కింద 2,20,945 కోట్లు, మూలధన వ్యయం కింద 33,487 కోట్లు చూపించారన్నారు. విద్యారంగానికి నిధుల కేటాయింపులు పెంచితే బాగుండేదన్నారు.

పోలీస్ స్టేషన్‌కు మరమ్మతులు చేయాలి

శంకరపట్నం, జూలై 25: మండలంలోని కేశవపట్నంలో శిథిలావస్థలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు మరమ్మతులు చేయాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి సుధాకర్ కు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్‌కుమార్ గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కేశవపట్నం పోలీస్‌స్టేషన్ శిథిలమై ఉరుస్తుందన్నారు. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన పోలీస్ స్టేషన్ శిథిలావస్థకు చేరడం వలన పోలీస్ అధికారులు, ప్రజలకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొంరయ్య, కోటేశ్వర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ మున్సిపల్ మేనేజర్‌గా భూపాల్‌రెడ్డి

హుజూరాబాద్, జూలై 25: హుజూరాబాద్ మున్సిపాలిటీ మేనేజర్‌గా రావుల భూపాల్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తున్న రాంమోహన్‌రాయ్ సిరిసిల్లకు బదిలీ కాగా, ఆయన స్థానంలో జమ్మికుంటలో విధులు నిర్వర్తిస్తున్న భూపాల్‌రెడ్డిని హుజూరాబాద్ మున్సిపల్ మేనేజర్‌గా నియమించారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించారు. సీనియర్ అసిస్టెంట్లు భూమానందం, సంపత్‌రావు కరీంనగర్ మున్సిపల్ కార్పొరే షన్‌కు, వార్డు ఆఫీసర్లు కుమార్, బిక్షపతి, శ్రీనివాస్‌ను వేరే మున్సిపాలిటీలకు బదిలీ చేశారు.

ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీపీ



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

హుజూరాబాద్, జూలై 25: హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని సీపీ అభిషేక్ మొహంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్షించి, వాటికి గల కారణాలను ఏసీపీ శ్రీనివాస్‌జీని అడిగి తెలుసుకొని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ విసిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అధికారులు అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్‌జీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల అభివృద్ధే టీయూడబ్ల్యూజే(ఐజేయూ)లక్ష్యం

- జాతీయ కౌన్సిల్ సభ్యుడు నగునూరి శేఖర్

సైదాపూర్, జూలై 25: జర్నలిస్టుల అభివృద్ధే లక్ష్యంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పని చేస్తున్నదని జాతీయ కౌన్సిల్ సభ్యుడు నగునూరి శేఖర్ అన్నారు. గురువారం సైదాపూర్ మండల కేంద్రంలో మండల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బండారి గట్టయ్య ఆధ్వర్యంలో మండల వర్కింగ్ జర్నలిస్టుల టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ కౌన్సిల్ సభ్యుడు నగునూరి శేఖర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గాండ్ల శ్రీనివాస్ హాజరై వర్కింగ్ జర్నలిస్టుల సభ్యత్వ నమోదు నిర్వహించారు. అనంతరం శేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై పోరాడేది టీయూడబ్ల్యూజే(ఐజేయూ)నే అన్నారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి దాతల విరాళం

చొప్పదండి, జూలై 25: పట్టణంలోని గ్రంథాలయానికి దాతలు కుర్చీలు, ప్యాడ్‌లను విరాళంగా అందజేశారు. పోటీ పరీక్షల కోసం యువత గ్రంథాలయానికి వస్తున్నారని చదువుకోవడం కోసం పది స్టడీ చైర్స్, ప్యాడ్‌లను సీపెల్లి జయ గంగయ్య, సీపెల్లి మనీషా, శ్రీనివాస్ అందజేయగా, గుర్రం సుజిత్‌రెడ్డి, కాట్నపల్లి మధుసూదన్‌రెడ్డి ఐదు స్టడీ చైర్లు, పది ప్యాడ్‌లను గ్రంథాలయ నిర్వాహకుడు కిషన్‌కు అందజేశారు.

భూ ఆక్రమణ కేసులో ముగ్గురి అరెస్ట్



నిందితులను అరెస్టుచేసి వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తీసుకువచ్చిన పోలీసులు

కరీంనగర్ క్రైం, జూలై 25: తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించి భూమిని ఆక్రమించిన కేసులో ముగ్గురు నిందితులు కరీంనగర్‌లోని విద్యారణ్యపురికి చెందిన మూల ప్రభాకర్‌రెడ్డి(66), అతడి అనుచరులైన వల్లంపహాడ్‌కు చెందిన జోముకుంట మల్లయ్య(64), తీగలగుట్టపల్లికి చెందిన పెరుకరి శ్రీనివాస్(54)లను గురువారం అరెస్ట్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం కరీంనగర్ హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన రాధికకు ఆమె తల్లి భూపతి రాజమణి కొనుగోలు చేసిన కరీంనగర్‌లోని వల్లంపహాడ్ గ్రామ శివారులో సర్వేనంబర్ 145లో 200గజాల ఇంటి స్థలాన్ని బహుమతిగా 2013లో రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఆ స్థలంలో రాధిక ఇంటి నిర్మాణం చేసుకునేందుకు వెళ్లి చూడగా అప్పటికే తన ఇంటి స్థలంతో పాటు దాదాపు ఇంకా 30 గుంటల స్థలం చుట్టు ప్రహరీతో పాటు ఒక గది నిర్మించి ఉంది. ఈ నిర్మాణం మూల ప్రభాకర్‌రెడ్డి, పెరుకరి శ్రీనివాస్, జోముకుంట మల్లయ్యలు చేశారని ఆమె తెలుసుకుంది. దీంతో వెంటనే బాధితురాలు కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాకు వెళ్ళి తనకి తగిన న్యాయం చేయాలనీ ఫిర్యాదు చేసింది. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేయగా బాధితురాలి తల్లి అయిన భూపతి రాజమణి ఆ స్థలాన్ని శ్రీ ప్రియ రియల్ ఎస్టేట్ కంపెనీ ద్వారా కొనుగోలు చేసిందని తెలిసింది. ఆ కంపెనీని 1993లో దాదాపు 15 ఎకరాల 22 గుంటల స్థలాన్ని వెంచర్‌గా చేసి 1996 వరకు ఎస్‌హెచ్ భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి ఓపెన్ ప్లాట్‌లుగా పలువురికి విక్రయించాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆ ప్లాట్‌లను విక్రయించేందుకు గాను కొంత మందిని ఆ భూముల సంబంధించిన యజమానులనే ప్లాట్ విక్రయ ఏజెం ట్లుగా నియమించు కున్నాడు. అందులో జోముకుంట మల్లయ్యకూడా ఒక పట్టేదారు కాగా, మూల ప్రభాకర్‌రెడ్డిలు ఇరువురు ఏజెంట్లుగా పనిచేశారని వెల్లడైంది. ఆ సమయంలో ఆ భూముల అమ్మకాలు, కొనుగోళ్లలో లోపాలను గ్రహించిన వీరు తప్పుడు అగ్రిమెంట్లు చేసి తిరిగి మూల ప్రభాకర్‌రెడ్డి, జోముకుంట మల్లయ్యలు వారి బంధువుల పేరిట సేల్ రిజిస్ట్రేషన్‌లు చేసి ఆ భూములను ఆక్రమించారని పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారిపై ఐపీసీ సెక్షన్ 447, 427, 467, 468, 471, 420, 120-బి, 506 రెడ్‌విత్ 34 ప్రకారం కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించగా కరీంనగర్ జిల్లా జైలుకు తరలించామని సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం అభ్యర్థుల తుది జాబితా విడుదల

సుభాష్‌నగర్, జూలై 25: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పోస్టులకు సంబంధించిన అభ్యర్థుల తుది జాబితాను ఆఫీసు బోర్డులో ఏర్పాటు చేశామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్ కింద కాంట్రాక్టు పద్ధతిపై వైద్యాధికారి(4), స్టాఫ్‌నర్స్(21), ఎంఎల్‌హెచ్‌పి(13), జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్(1), ఏఎన్‌ఎం(1), ఫార్మాసిస్టు(3), డీఈవో(1), ఆప్తోమెట్రిస్ట్(1) పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ ఇదివరకే విడుదల చేశామని తెలిపారు. అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, తుది ఉత్తీర్ణత జాబితాను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఏర్పాటు చేశామని, అలాగే అధికార వెబ్‌సైట్‌లో కూడా పొందుపరిచామని తెలిపారు.

ఎస్‌యూకు రూ.200 కోట్లు కేటాయించాలి

కరీంనగర్ టౌన్, జూలై 25: శాతవాహన యూనివర్శిటీకి 200 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టాలని పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పీడీఎస్‌యు సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. కార్యక్రమంలో పీడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు కెమసారం రవితేజ, సహాయ కార్యదర్శి కోనేటి అనిల్, జిల్లా నాయకులు కొయ్యడ రాకేశ్, ఎండి. సోను, మిరుదొడ్డి అజయ్, శ్రీనివాస్, ప్రవీణ్, ఎండి అస్లం తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

సుభాష్‌నగర్, జూలై 25: విద్యా హక్కు చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని బీమ్ ఆర్మీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొయినిపెల్లి చంద్రయ్య, జిల్లా కన్వీనర్ చెల్పూరి రాంమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు స్కూల్లల్లో విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదని ఆరోపించారు.

కామదేను సూపర్ బజార్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్యానెల్ విజయం

కరీంనగర్ అర్బన్, జూలై 25: కరీంనగర్ కామదేనువు సూపర్ బజార్ ఎన్నికలలో కాంగ్రెస్ ప్యానెల్ విజయం సాధించింది. కామదేనువు సూపర్ బజార్ సంస్థకు మొత్తం 10 మంది డైరెక్టర్ పదవులుండగా ఐదు డైరెక్టర్ పదవులు ఇప్పటికే ఏకగ్రీవం కాగా మిగతావాటికి గురువారం ఎన్నికలు జరిగాయి. ఆ పదవులకు ఎనిమిది మంది సభ్యులు పోటీ పడ్డారు. ఓటింగ్‌లో కాంగ్రెస్ ప్యానల్ ద్వారా ఐదుగురు సభ్యులు గెలుపొందారు. ఎన్నికల ద్వారా మూల వెంకట రవీందర్‌రెడ్డి, మల్లికార్జున సత్యనారాయణ, ముదుగంటి శ్రీనివాసరెడ్డి, మిడిదొడ్డి మధుసూదన్‌రావు, కొండం వేణు గోపాల్‌రెడ్డిలు గెలుపొందారు.

'మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'



మాట్లాడుతున్న ఏసీపీ ఉపేందర్

కరీంనగర్ క్రైం, జూలై 25: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దని కరీంనగర్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఏసీపీ ఉపేందర్ అన్నారు. గురువారం కరీంనగర్ రూరల్ పోలీసులు, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో తీగల గుట్టపల్లిలోని ఎస్‌వీజేసీ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాలు వినియోగం-దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ కృష్ణమూర్తి, కరీంనగర్ రూరల్ ఎస్ఐ శేఖర్, కళాశాల డైరెక్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, జూలై 25 : రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీ, ఎస్సీ ,ఎస్టీలకు చెందిన వర్గాలతో పాటు ఇతరులకు అధిక నిధులు కేటాయించడం పట్ల జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి తాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో స్వీట్లు పంపిణీ చేశారు. నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి క్షీరాభిషేకం చేశారు. నగర కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు అహమ్మద్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్ స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, సమద్ నవాబ్, శ్రావణ్ నాయక్, అబ్దుల్ రెహమాన్, సిరాజు హుస్సేన్, అక్బర్ అలీ, నేహాలు అహ్మద్, కమురుద్దీన్ పాల్గొన్నారు.

'రాష్ట్ర బడ్జెట్ అంతా అంకెల గారడీ'



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

గణేష్‌నగర్, జూలై 25: రాష్ట్ర బడ్జెట్ అంతా అంకెల గారీ అని, కరీంనగర్‌కు గాడిదగుడ్డు తప్ప ఏమీ ఇవ్వలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. గురువారం నగరంలోని తెలంగాణ చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకట్‌రెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, బోయినపల్లి ప్రవీణ్‌రావు, కళ్లె వాసుదేవరెడ్డి, రాపర్తి ప్రసాద్, బొంతల కళ్యాణచంద్ర, కటకం లోకేష్ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సిద్ధం కావాలి



జమ్మికుంటలో మాట్లాడుతున్న రంగు భాస్కరాచారి

భగత్‌నగర్, జూలై 25: బీజేపీ శ్రేణులు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రంగాపూర్ మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ అన్నా రు. గురువారం చింతకుంటలోని ఓ ఫంక్షన్ హాలు లో కొత్తపల్లి మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి మండల కార్యాలయాలన్నీ జిల్లా కేంద్రంలో ఉండడంతో ప్రజలకు నానా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కార్యాలయాలను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కడార్ల రతన్‌కుమార్, అనిల్‌కుమార్, అంజనీకుమార్, కడారి శాంతశ్రీనివాస్, జిట్టవేని రేణు, కుంట తిరుపతి పాల్గొన్నారు.

హుజూరాబాద్: రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలందరూ కష్టపడి పనిచేసి ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలింపించుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు అధ్యక్షతన పట్టణ కార్యవర్గ సమావేశం జరిగింది. పట్టణంలో నెలకొన్న సమస్యలపై రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సమావేశంలో బీజేపీ నాయకులు జెల్ల సుధాకర్, మెరుగు రాజిరెడ్డి, కేసరి శేషయ్య, నల్ల సుమన్, గూడూరు రాంరెడ్డి, గూడూరు మల్లారెడ్డి పాల్గొన్నారు.

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి అన్నారు. గురువారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా భాస్కరాచారి హాజరై మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ శీలం శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్‌నాయకులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం జరిగింది. బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్, జిల్లా కార్యదర్శి చెన్నమాధవుని నర్సింహారాజు మాట్లాడుతూ స్థానిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై నిరంతరం పోరాటం కొనసాగిస్తా మన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు కొంరయ్య, నాయకులు పాల్గొన్నారు.

'రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు నిధులు నిల్'

హుజూరాబాద్‌రూరల్, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు ప్రయోజనాల కోసం ఎలాంటి నిధులను కేటాయించలేదని బీజేపీ జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం తన నియోజకవర్గ అభివృద్ధి కోసం పెద్దఎత్తున నిధులను కేటాయించుకొని మిగతా నియోజక వర్గాలను విస్మరించారన్నారు. ఇంత అన్యాయం జరుగుతున్నా మిగతా మంత్రులు, శాసనసభ్యులు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. నిధులను తీసుకరావడంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చారిజ వొడితల ప్రణవ్ విఫలమయ్యారన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

హుజూరాబాద్, జూలై 25: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి చాలా అన్యాయం జరిగిందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన 16మంది ఎంపీలు కలిసి 16 పైసలు కూడా తీసుకురాకపోవడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి పూర్తిస్థాయిలో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి, జూలై 25: పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. చొప్పదండి పోస్ట్ ఆఫీస్‌లో బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీమాతో పాటు పొదుపు పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ కొత్తూరి మహేశ్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, మేనేజర్ రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'పేదవారికి న్యాయం జరిగే విధంగా రాష్ట్ర బడ్జెట్'

గన్నేరువరం, జూలై 25: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ పేదవాడికి న్యాయం జరిగే విధం గా రాష్ట్ర బడ్జెట్ రూపుదిద్దుకుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ ఒక ప్రటనలో తెలిపారు. వ్యవసాయానికి, సాగునీటికి, తాగునీటికి, విద్యావైద్యానికే కాకుండా ప్రతీ పేదవాడికి అన్ని రకాలుగా ఉపయోగపడే విధంగా రాష్ట్ర బడ్జెట్ ఉందన్నారు.

● రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి అన్నారు.

ఇల్లందకుంట: అన్ని వర్గాల ప్రజలకు సమతుల్యమైన బడ్జెట్ కేటాయించారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వంగ రామకృష్ణ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చేందుకు పెద్దపీట వేసిందని తెలిపారు.

వంతెనను ప్రారంభించాలని బీజేపీ నాయకుల ధర్నా



వంతెన వద్ద ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

రామడుగు, జూలై 25: రామడుగు వెళ్లే దారిలో నిర్మించిన నూతన వంతెనను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ఏడు కోట్ల రూపాయలతో నిర్మించిన వంతెనను ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉపయోగిస్తు న్న వంతెన శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉందన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ధర్నాను విరమించాలని బీజేపీ నాయకులను కోరారు. వారు వినకపోవడంతో బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, బండ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మోడీ రవీందర్, పోచంపల్లి నరేష్, పురెళ్ల శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

కాపు సంఘం లీగల్ సెల్ కన్వీనర్‌గా రత్నాకర్



కరీంనగర్ అర్బన్, జూలై 25: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం లీగల్‌సెల్ కన్వీనర్‌గా న్యాయవాది కరీంనగర్‌కు చెందిన ఒంటెల రత్నాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండా దేవయ్య నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారికి రత్నాకర్ ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ ఈఈ బదిలీ

కరీంనగర్ టౌన్, జూలై 25: కరీంనగర్ మున్సిపల్ కార్పోరేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బి మహేందర్ గ్రేట్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాజ్‌కుమార్ కరీంనగర్‌కు బదిలీపై వచ్చారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అన్నదానం

సుభాష్‌నగర్, జూలై 25: రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో స్వేతన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, లంబురాజిరెడ్డి, అరి కొంతం రవీందర్‌రెడ్డి, రావికంటి కృష్ణప్రసాద్, బద్దం మల్లారెడ్డి, రావికంటి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజన్న

సుభాష్‌నగర్, జూలై 25: మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) జిల్లా ఉపాధ్యక్షుడిగా కొత్తురి రాజన్నను నియమిస్తూ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ రాజన్న కృతజ్ఞతలు తెలిపారు.

'మానేరు'లో ఒలింపిక్స్ ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 25: నగరంలోని మానేరు ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా ఒలింపిక్స్‌ను ప్రారంభించారు. ఒలింపిక్ పతాకం ఆకారంలో కూర్చొని ఆహూతులను ఆకట్టుకున్నారు. శుక్రవారం పారీస్ ఒలింపిక్ క్రీడలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు వినూత్న ప్రదర్శన చేశారు. ఈసందర్భంగా మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో దేశ క్రీడాకారులు అద్వితీయ ప్రతిభకనబరిచి అత్యధిక పతకాలను కైవసం చేసుకోవాలని కాంక్షించారు. కార్యక్రమంలో మానేరు డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు సీ.మహేందర్, జహేద పాల్గొన్నారు.

ఆలిండియా రెడ్డిసంఘం జిల్లా అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, జూలై 25: ఆలిండియా రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడిగా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎడవెల్లి మధుసూదన్‌రెడ్డిని నియమించినట్లు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిట్‌రెడ్డి మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీచైతన్య అకాడమిక్స్‌లో 'గ్రీన్‌ఇండియా మిషన్'

కరీంనగర్ అర్బన్, జూలై 25: స్థానిక విద్యారణ్యపురి శ్రీ చైతన్య పాఠశాల అకాడమిక్స్‌లో గురువారం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం గ్రీన్ ఇండియా మిషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పాల్గొని గ్రీన్ ఇండియా మిషన్ స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాలల ఏజీఎం ఎం.రాజు, ప్రిన్సిపాల్ సుమన్, సి బ్యాచ్ ఇన్‌చార్జి మహేష్, ప్రైమరీ ఇన్‌చార్జి శారద, ప్రీప్రైమరీ ఇన్‌చార్జి ప్రియదర్శిని, ఏవో సుధీర్, అనిల్ పాల్గొన్నారు.

గౌతమి నంది పురస్కారానికి 'వైరాగ్యం' ఎంపిక

కరీంనగర్ కల్చరల్, జూలై 25: కరీంనగర్‌కు చెందిన రచయిత, భవానీ సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు వైరాగ్యం ప్రభాకర్‌ను ఎంపిక చేసినట్లు విశ్వవిఖ్యాత ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు ఎస్‌విఆర్ వేంకటేశ్, శ్రీగౌతమేశ్వర గోసంరక్షణ సమితి అధ్యక్షుడు ఆకుల విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు

సైదాపూర్, జూలై 25: సైదాపూర్ మండలం ఆకునూర్ గ్రామం ఐదో వార్డులో ప్రజలు విషజ్వరాలతో బాధప డుతున్నారు. మూడురోజులుగా జ్వరాలతో బాధపడుతూ చాలామంది మంచాన పడ్డారు. సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని, వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పవర్‌లూం కార్మికుల దీక్షలు

గంగాధర, జూలై 25: పనిలేక ఎనిమిది నెలలుగా ఖాళీగా ఉంటున్నామని, ఉపాధి కల్పించాలని గర్షకుర్తి పవర్‌లూం కార్మికులు డిమాండ్ చేశారు. పవర్‌లూం కార్మికులు గర్షకుర్తిలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా పవర్‌లూంలకు పనిలేక కుటుంబాలను పోషించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పనికల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పవర్‌లూం కార్మికసంఘం నాయకులు పాల్గొన్నా రు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వన మహోత్సవం

సైదాపూర్, జూలై 25: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అంజనేయులు, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి రాజశేఖర్ పాల్గొన్నారు.

మానకొండూర్: మానకొండూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వనమహోత్సవంలో భాగంగా కళాశాల ఆవరణలో మొక్కలను నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయరావు, అధ్యాపకులు ఉన్నారు.

అనారోగ్యంతో రేషన్ డీలర్ మృతి

మానకొండూర్, జూలై 25: మండల కేంద్రానికి చెందిన రేషన్ డీలర్ ఉండింటి శివకుమార్ (34) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. శివకుమార్ రెండురోజుల క్రితం అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి తల్లి, ఇద్దరు చెల్లెలు, భార్య సంధ్య ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో శిక్ష సప్త వేడుకలు

ఇల్లందకుంట, జూలై 25: నూతన జాతీయ విద్యావిధానం 2020 ప్రారంభించి నాలుగేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే శిక్ష సప్త వేడుకలను గురువారం మండలంలోని టేకుర్తి ఆదర్శ పాఠశాలలో జరిగాయి. ఈ సందర్భంగా బోనాలు, బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

ఇల్లందకుంట, జూలై 25: మండలంలోని శ్రీరాములపల్లెలో విద్యుదాఘాతంతో మేక మృతి చెందింది. బాధితుడు పర్లపల్లి మల్లేష్ మేకలను మేపుకొని సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఊరి చివరిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉండే ఎర్త్‌వైర్ మేకకు తగలగానే విద్యుదాఘాతంతో అక్కడికక్క డే మృతి చెందింది.